
సాక్షి
ఖమ్మం

సోమవారం । 24 । జూన్ । 2024



జలవిహారం కలేనా..?

భద్రాచలం వద్ద గోదావరిలో జల విహారం తమకు కలగానే మిగిలిపోతోందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. 8లో



ఎర్రజెండాలే ప్రజలకు అండ..

ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఎర్రజెండాలే అండగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వెదురు బొంగుల విక్రయాలతో రూ.14 కోట్లు ఆదాయం

- టీజీఎఫ్‌డీసీ సీజీఎం డి.వెంకటేశ్వరరెడ్డి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డి.వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లిటౌన్: వెదురు బొంగుల విక్రయాల ద్వారా సత్తుపల్లి వెదురు టింబర్‌డిపోకు గత ఆర్థిక సంవత్సరం రూ.14 కోట్లు ఆదాయం లభించిందని తెలంగాణ ఫారెస్ట్ డెలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్, రీజినల్ మేనేజర్ డి.వెంకటేశ్వరరెడ్డి వెల్లడించారు. సత్తుపల్లి టింబర్‌లో వెదురు వేలంపాటను ఆదివారం పరిశీలించారు. అదేవిధంగా రూ.1.30 కోట్లతో నిర్మిస్తున్న డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్ కార్యాలయాలు, క్వార్టర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది 28 లక్షల వెదురును విక్రయించామని, ఈ ఏడాది ఇప్పటికే 37 లక్షల వెదురు బొంగుల విక్రయాలు చేపట్టామని, లక్ష్యానికి మించి విక్రయాలు జరుగుతున్నాయని, మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. భవన నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని, పెండింగ్ పనులు ఉండొద్దని పేర్కొన్నారు. ఆయన వెంట డివిజనల్ మేనేజర్ గణేశ్, ప్లాంటేషన్ మేనేజర్లు సైదానాయక్, కవిత, డీపీఎం నాగలక్ష్మి ఉన్నారు.

ఉత్సాహభరితంగా పద్యగాన పోటీలు



నీలం వెంకటేశ్వర్లుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: చందాల కేశవదాసు కళా పరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పద్యగాన పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో చందాల కేశవదాసు 148వ జయంతి సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షుడు కొండపల్లి జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో నీలం వెంకటేశ్వర్లుకు (పల్నాడు జిల్లా) మొదటి బహుమతి, ప్రకాశం (ఖమ్మం)కు రెండవ బహుమతి, ముక్తి భాస్కరరావు (ఖమ్మం) మూడో బహుమతి దక్కాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు ఎస్.దామోదర్, ఖాదర్ బాబు, విజయలక్ష్మి, సులేమాన్, న్యాయవాది కర్లపుడి శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా ‘సింగం’

ఖమ్మంలీగల్: కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు సింగం జనార్దన్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా సవరణ



చకచకా భూముల ధరలు పెంపు ప్రక్రియ

- ఇప్పటికే పూర్తయిన కమిటీల ప్రాథమిక సమావేశం
- ప్రభుత్వ, మార్కెట్ విలువ ఆధారంగా ప్రతిపాదనలు
- బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పెరగడం ఖాయం
- ఖమ్మంలో కొత్త కలెక్టరేట్ చుట్టుపక్కల భూముల ధరకు రెక్కలు?

ఖమ్మంమయూరిసెంటర్ : వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేగవంతం అయింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో భూముల విలువ పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలతో పోలిస్తే.. బహిరంగ మార్కెట్ విలువ అధికంగా ఉంది. బహిరంగ మార్కెట్ విలువలో సగం వరకు ప్రభుత్వ విలువ పెంచితే ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తుందనేది సర్కారు యోచన. దాని ప్రకారం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెంచాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ధరల పెంపునకు సంబంధించిన ప్రక్రియకు ఈనెల 7న ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయగా, దాని ప్రకారం ఉమ్మడి జిల్లాలో భూముల విలువలు సవరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

20, 21 తేదీల్లో సమావేశాలు పూర్తి.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలతో పాటు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలను పెంచేందుకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 20న భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌లో, 21న ఖమ్మం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏయే ప్రాంతాల్లో భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎలా ఉన్నాయి..? అక్కడ ప్రభుత్వ ధర ఎంత ఉంది అనే వివరాలపై చర్చించారు. వీటితో పాటు భూముల ధరలు ఎంత వరకు పెంచొచ్చనే అంశాలనూ పరిశీలించారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు..

భూ విలువలు పెంచేందుకు ఆయా జిల్లాల్లో గ్రామీణ కమిటీలకు చైర్మన్‌గా ఆర్డీఓ, సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీఓ, మార్కెట్ వ్యాల్యూ సబ్ రిజిస్ట్రార్‌ను, కన్వీనర్‌గా స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను నియమించారు. ఇక అర్బన్ కమిటీలకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్ సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో కొత్త వార్డులు, కొత్త కాలనీలు, వాణిజ్య భవనాల వివరాలను మున్సిపల్ అధికారులు అర్బన్ కమిటీకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కన్వర్షన్‌కు సంబంధించిన వివరాలను తహసీల్దార్లు కమిటీకి అందించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఈ నెల 29వ తేదీలోగా అధికారులు భూముల ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. పెరిగే భూమి విలువను జూలై 1న పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతారు. జూలై 15 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు 20వ తేదీ వరకు గడువు విధించారు. ఇక ఆగస్టు 1 నుంచి పెరిగిన భూ విలువలను ప్రభుత్వం అమలు చేయనుంది.

రూ.400 కోట్ల వరకు ఆదాయం..

వ్యవసాయ, వ్యవసాయేతర భూ విలువను పెంచితే ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.400 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరలతో ఉమ్మడి జిల్లాలో సంవత్సరానికి రూ.250 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. భూ విలువలు పెరిగితే జిల్లా నుంచి భారీగా ఆదాయం వస్తుందని, అంచనాకు మించి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పని లేదని అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తాం..



భూముల విలువల సవరణ ప్రక్రియను ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కమిటీల సమావేశాలు పూర్తి చేశాం. ఈ నెల 29 నాటికి భూ విలువలను ఫైనల్ చేసి ప్రజల ముందు ఉంచుతాం. ప్రజల అభ్యంతరాలు స్వీకరణ, పరిష్కారం అనంతరం జూలై 24న భూముల విలువలను ఫైనల్ చేస్తాం.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ

సర్కారు ఖజానా నిండేలా..

ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో భూ విలువలు సవరిస్తారు. దీనిపై కమిటీలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సూచనలతో అటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఇటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగేలా విలువలు పెంచాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రధానంగా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువలను భారీగా పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో మెయిన్‌రోడ్డుకు ఉన్న వ్యవసాయేతర భూముల విలువ ప్రస్తుతం ఉన్న ధరకు నాలుగు నుంచి ఐదు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ విలువల ఆధారంగా కనీసం 20 నుంచి గరిష్టంగా 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఇక జాతీయ రహదారుల వెంట భూ విలువలు పెరుగుతాయని అంతా భావిస్తున్నా పలు కారణాలతో ఆయా ప్రాంతాల్లో సాధారణంగానే ధరలు పెరగనున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం నగరంలో త్రీటౌన్ ప్రాంతంలో ప్రభుత్వ భూవిలువ బహిరంగ మార్కెట్ విలువకు సమానంగా ఉండడంతో ఈసారి నామమాత్రంగానే పెంచే అవకాశం ఉంది.

ఏడాదిలోపే సమస్యల పరిష్కారం

- హామీలు అమలు చేసి ప్రతిపక్షాల నోరు మూయిస్తాం
- రూ.31 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ
- రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



ఆరెంపుల సభలో మంత్రి పొంగులేటికి పుష్పాభిషేకం చేస్తున్న రైతులు

ఖమ్మంరూరల్/ కూసుమంచి : పాలేరు నియోజకవర్గంలోని సమస్యలన్నీ ఏడాది లోపే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ కొన్ని ప్రతిపక్ష పార్టీలు అవాకులు, చెవాకులు పేలుతున్నాయని, హామీలు నెరవేర్చి వాటి నోర్లు మూయిస్తామని అన్నారు. తాము అధికారంలోకి వచ్చేముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామని, రెండు నెలల్లో రూ.31 వేల కోట్ల రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని గత పాలకులు అప్పులకుప్పగా మార్చారని, తాము అష్టకష్టాలు పడైనా ప్రతీ హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో నాటి ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు సూచించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కాగా, రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆరెంపుల మాజీ సర్పంచ్ బండి జగదీష్ ఆధ్వర్యంలో పొంగులేటికి పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ గణేష్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, కూసుమంచి ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ ఎంపీపీలు రామసహాయం వెంకటరెడ్డి, మట్టె గురవయ్య, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, జూకూరి గోపాలరావు, కళ్లెం వెంకటరెడ్డి, చింతమళ్ల రవికుమార్, మద్ది వీరారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, మంకెన వాసు, చింతమళ్ల పద్మ, అశోక్‌నాయక్, ఎండీ హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, ఎడవెల్లి రాంరెడ్డి, కొండపర్తి సురేష్, చెన్నా మోహన్, కంచర్ల జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



వసతిగృహంలో కిచెన్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్ నాయక్

ఖమ్మంమయూరిసెంటర్/కొణిజర్ల: ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ హాస్టళ్లను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్‌లను పరిశీలించారు. కూరల్లో వాడే కారాన్ని పరిశీలించి, శాంపిల్ తీసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు, మెనూపై ఆరా తీశా రు. పరిశుభ్రత పాటించాలని, సరిపడా గాలి, వెలు తురు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. భోజనం, చదువుతో పాటు ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ధరణి ఫైళ్లు పరిష్కరించాలి..

ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని మధుసూదన్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి ఫైళ్లు, రిజిస్ట్రేషన్ స్లాట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగాల నుంచే బీజేపీ పుట్టింది..

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంరూరల్: నిరంతరం దేశ సమగ్రత, ధర్మ పరిరక్షణ కోసం పరితపించి బలిదానమైన మహానుభావుల త్యాగాల నుంచే బీజేపీ ఆవిర్భవించిందని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. వరంగల్ క్రాస్‌రోడ్‌లో ఆదివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయవాది శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి ప్రధాని నెహ్రూ విధానాలను నిరసించి జమ్మూ కశ్మీర్ దేశంలో అంతర్భాగమని నినదించిన ముఖర్జీని అప్పటి కశ్మీర్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేసి హత్య చేసిందని అన్నారు. దేశ సమగ్రత కోసం ఆయన ప్రాణాలను తృణప్రాయంగా వదిలేశారని నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేక సంతోష్‌రెడ్డి, వి.రాంబాబు, ఎస్.నాగరాజు, పృథ్వీనాయక్, వెంకన్న, సుదర్శన్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో 85 జంటలు పాల్గొన్నాయి. ప్రస్తుత ఈఓ రమాదేవి సెలవుపై వెళ్లడంతో వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు సోమవారం ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించనున్నారు.

ఆగిన కంచుమేళం!

- అనారోగ్యంతో కోయకళాకారుడు, పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి
- మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్
- సంతాపం తెలిపిన మంత్రులు



సకిని రామచంద్రయ్య (ఫైల్)

మణుగూరు టౌన్: కంచుమేళం శాశ్వతంగా ఆగిపోయింది. ఆదివాసీ సంప్రదాయ కళల రక్షకుడు, మణుగూరు మండలం బావికూనవరం గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య (65) తుదిశ్వాస విడిచారు. అంతరించిపోతున్న గిరిజన కళలను కాపాడుతూ, కాలినడకన మారుమూల గ్రామాల్లో తిరుగుతూ భవిష్యత్ తరాలకు అందించిన జానపద కళాకారుడు, డోలు వాయిద్యకారుడు అయిన రామచంద్రయ్య కొంతకాలంగా గొంతు సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కంచుతాళం, కంచుమేళంతో ఆదివాసీ కథలు అలవోకగా, కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన ఏకైక కళాకారుడు రామచంద్రయ్య మృతిపట్ల మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.

కుటుంబ సభ్యులకు కలెక్టర్ హామీ..

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కూనవరంలోని రామచంద్రయ్య మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, స్థలం సమస్య ప్రస్తావించగా, పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని, అంత్యక్రియల అనంతరం తన వద్దకు రావాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

అందని నాటి ప్రభుత్వ సాయం

సకిని రామచంద్రయ్య వనదేవతల వీరగాథలు చెప్పడంతో పాటు రెండేళ్లకోసారి వచ్చే ఆదివాసీ జాతరైన సమ్మక్క సారలమ్మ, పగిడిద్ద రాజుల వంటి దేవరుల కథను కళ్లకు కట్టినట్లుగా గానం చేయడంతో పాటు సమ్మక్క సారలమ్మ తల్లులను గద్దెల వద్దకు తీసుకు వచ్చే క్రమంలో కీలకంగా వ్యవహరిస్తారు. అంతరించిపోతున్న ఆదివాసీ కళలను కాపాడుతున్న తీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 జనవరి 25న పద్మశ్రీ అవార్డు అందజేసింది. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సత్కరించింది. ఆ వెంటనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి ఆర్థికసాయంతో పాటు 426 చదరపు గజాల ఇంటి స్థలం అందిస్తామని ప్రకటించింది. కానీ ఇవ్వలేదు. అనారోగ్యంతో ఉన్న తనకు ఆర్థిక సాయం అందించి, కాపాడాలని కలెక్టరేట్ చుట్టూ తిరిగినా, అధికారులకు విన్నవించినా మోక్షం కలగలేదు. కళాకారులకు అందించే రూ.10 వేల పింఛన్ అందించడంలోనూ జాప్యం జరిగింది. పలుమార్లు కలెక్టర్లకు విన్నవించినా ఆర్థికసాయం ట్రెజరీ నుంచి రావాలంటూ సమాధానం రావడంతో వైద్య పరీక్షలకు అప్పులు చేసి రూ.4 లక్షలతో వైద్యం చేయించుకున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచార సమయంలో మణుగూరు వచ్చిన రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్కను కలిసి న్యాయం చేయాలని వేడుకోగా.. ఆమె ఆర్థిక సాయం అందించారు. ఎన్నికల కోడ్ ముగిశాక కలవాలని సూచించగా, ఆయన కుటుంబ సభ్యులు ఈ నెల 21న మళ్లీ సీతక్కను కలిశారు. దీంతో నాలుగైదు రోజుల్లో చెక్కు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కాగా ఈ లోపే రామచంద్రయ్య మృతి చెందారు.

జానపద కళకు తీరని లోటు: భట్టి

ఖమ్మంవన్‌టౌన్ : అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి జానపద కళకు తీరని లోటని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారసత్వంగా వచ్చిన గిరిజన సంప్రదాయ కళను జీవనాధారంగా చేసుకొని డోలు వాయిద్యానికి దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి పెట్టారని కొనియాడారు. రామచంద్రయ్య కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరణించడం బాధాకరం

ఖమ్మంమయూరిసెంటర్ : కోయ అధ్యయన వేదిక ఆత్మీయ మిత్రుడు, సమ్మక్క సారలమ్మ తదితర కోయ వీరపురుషుల కథా గాయకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సకిని రామచంద్రయ్య ఆర్థిక ఇబ్బందులతో మరణించడం బాధాకరమని ప్రముఖ కవులు పద్దం అనసూయ, డాక్టర్ గూడూరు మనోజ, జయధీర్ తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వయసు పైబడి మరణించలేదని, గత ప్రభుత్వం ఇస్తామన్న రూ. కోటి ఆర్థిక సాయం నేటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోయ ఆదివాసీ కళాకారుడు ఇలాంటి స్థితిలో మృతిచెందడం కలచి వేస్తోందని తెలిపారు.

ఈసారైనా ఫలించేనా?!

- ఖమ్మం ఫైర్‌స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు
- 12 ఏళ్లుగా శిథిల భవనంలోనే కార్యాలయం
- ఇక్కుఇక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు
- గతంలో ఓసారి నిధులు వచ్చినా వెనక్కి..



రేకుల షెడ్డులో కొనసాగుతున్న కార్యాలయం



రేకులు పగిలిపోయిన వాహనాల షెడ్డు

ఖమ్మంక్రైం: జిల్లాలో అత్యంత కీలకమైన ఖమ్మం అగ్నిమాపకశాఖ కార్యాలయం శిథిల భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ నూతన భవన నిర్మాణానికి గతంలో నిధులు మంజూరైనా వెనక్కి వెళ్లాయి. మళ్లీ తాజాగా నిధులు కేటాయించడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని భవనంలో 12ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎన్నెస్పీ క్యాంప్‌లో స్థలం కేటాయింపు

ఖమ్మం అగ్నిమాపక శాఖ కార్యాలయానికి 12ఏళ్ల క్రితం ఎన్నెస్పీ క్యాంప్‌లో అప్పటికే సగం శిథిలమైన 1,250 గజాల స్థలంలోని భవనాన్ని కేటాయించారు. అందులోనే వాహనాల కోసం ముందు భాగంలో షెడ్డు నిర్మించుకుని భవనంలో ఉద్యోగులు కార్యకలాపాలు నిర్వర్తించేవారు. కానీ చిన్నపాటి వర్షం పడితే చాలు మొత్తం కురుస్తుండడంతో ఇబ్బంది ఎదురుకాగా.. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియక, తరచు పాములు వస్తుండడంతో ఆందోళనకు చెందారు. ఈనేపథ్యాన రేకులతో మరో రెండు గదుల షెడ్డు నిర్మించారు. ఇందులోని ఓ గదిలో అగ్నిమాపకశాఖాధికారి, మరో గదిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక శిథిలావస్థకు చేరిన భవనంలోకి వెళ్లే పరిస్థితి లేక స్టోర్ రూమ్‌గా మార్చారు. అయితే, ఉద్యోగులు భోజనం చేయడానికి కూడా వసతి లేక వాహనాల షెడ్‌లో లేదంటే చెట్ల కింద భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తొలినాళ్లలో ఈ భవనంలోనే జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయం సైతం ఉండడంతో సరిపోక ఇరుకు గదుల్లో సమస్య ఎదుర్కొగా.. జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని రాపర్తినగర్‌లోని అద్దె భవనంలోకి మార్చారు.

ఐదేళ్ల క్రితం నిధులు మంజూరైనా...

ఐదేళ్ల క్రితం డీఆర్‌ఎఫ్(డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) నుండి ఖమ్మం అగ్ని మాపకశాఖ కార్యాలయ భవనానికి నిధులు మంజూరయ్యాయి. అయితే, వీటిని వినియోగించుకోవడంలో అధికారులు విఫలం కావడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో చేసేదేం లేక శిథిల భవనం విధులు కొనసాగిస్తున్నారు. మళ్లీ తాజాగా డీఆర్‌ఎఫ్ కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.193 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా అందులో ఖమ్మం అగ్నిమాపక శాఖ కార్యాలయ భవనానికి రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు కేటాయించినట్లు తెలిసింది. ఈ నిధులతో ఖమ్మం కార్యాలయంతో పాటు జిల్లా కార్యాలయాన్ని నిర్మించే అవకాశముందని సమాచారం. తద్వారా తమ కష్టాలు తీరనున్నందున ఉన్నతాధికారులు త్వరగా చొరవ చూపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చుక్కల దుప్పి

అటవీ అధికారులకు అప్పగింత



దుప్పిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అర్బన్ పార్కులోని ఓ చుక్కల దుప్పి తప్పించుకొని ఆదివారం ద్వార కాపురి కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి వచ్చింది. గమనించిన సిబ్బంది, స్థానికులు దుప్పిని పట్టుకొని అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. దుప్పి జలగంనగర్‌లోని ఫెన్సింగ్‌ను దాటుకొని వచ్చే టప్పుడు శరీరంపై గాయాలై రక్తస్రావం అవుతుండటంతో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ వెటర్నరీ వైద్యులతో చికిత్స చేయించారు. ఈలోగా పండ్లు తెప్పించి తినిపించారు. అనంతరం ఎఫ్ఎస్ఓ నర్సింహా, ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు క్యాంప్ కార్యాలయానికి చేరుకొని దుప్పిని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించి అర్బన్ పార్కులో వదిలారు.

పెట్రోలియం డీలర్ల జిల్లా కమిటీ ఎన్నిక

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఆదివారం జిల్లా పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరప్రగడ రంగనాథ్, జనరల్ సెక్రటరీగా కూరపాటి మంజుల, కోశాధికారిగా వజినేపల్లి రవికుమార్, ఉపాధ్యక్షులుగా సన్నె ఉదయ్‌ప్రతాప్, కోన జనార్దన్, జాయింట్ సెక్రటరీలుగా దమ్మాలపాటి నగేశ్, మద్ది పిచ్చయ్య, వి.శ్రీనివాస్, ఈసీ మెంబర్లుగా అద్దంకి విప్లవ్‌కుమార్, ఎం.దిలీప్‌రెడ్డి, బి.రాంమూర్తి, గౌరవ సలహాదారులుగా నాగబత్తిని రవి, గోళ్ల జనార్దన్, కట్టా కృష్ణార్జున్‌రావు ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోతుకూరి గోపాల్‌రావు తెలిపారు.

పాశం నాగేశ్వరరావుకు సన్మానం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జిల్లాకు చెందిన పాశం నాగేశ్వరరావును ఆదివారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, అసోసియేషన్ చైర్మన్ కనకం జనార్దన్‌రావు, నాగేంద్ర‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అసోసియేషన్ బాధ్యులు ఎం.రామకృష్ణ, సీహెచ్ ఓంప్రకాష్, కె.ఉపేంద్రనాథ్, ఉపేంద్రయ్య, బి.కృష్ణ, జి.కిశోర్ పాల్గొన్నారు.

13 మంది జూదరులు అరెస్ట్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 13 మంది జూదరులను ఆదివారం సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.21,500 నగదుతో పాటు మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు.

డబ్బులు అడిగినందుకు దాడి

నేలకొండపల్లి: అప్పుగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగినందుకు తనపై దాడి చేశారని బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన షేక్ మైహిముదా అదే గ్రామానికి చెందిన వ్యక్తి కి రూ.10 వేలు అప్పుగా ఇచ్చింది. 18 నెలల తరువాత ఇచ్చిన డబ్బులను ఇవ్వమని ఆదివారం ఇంటి వద్దకు వెళ్తే ఆ కుటుంబ సభ్యులంతా దాడి చేసి గాయపరిచారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

బైక్ చోరీ నిందితుడి పట్టివేత

నేలకొండపల్లి: బైక్‌ను అపహరించి.. దానిని విక్రయించేందుకు వెళ్తూ నిందితుడు పట్టుబడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పైనంపల్లి మాజీ సర్పంచ్ భూక్యా వెంకన్న తన ద్విచక్ర వాహనాన్ని మూడు రోజుల కిందట విద్యుత్ కార్యాలయం వద్ద పార్క్ చేశాడు. దీనిని గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. ఆదివారం బైక్‌ను కోదాడలో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా వెంకన్న సతీమణి సుభద్ర బైక్‌ను గుర్తుపట్టి, అతడిని పిలిచి ఆపారు. బైక్ తమదని తాళాలు తీసుకున్నారు. గ్రామస్తులు వచ్చి తనకు బుద్ధి చెప్పి స్థానిక పోలీసులకు అప్పగించారు. మూడు రోజుల తరువాత బైక్ లభించటంతో వెంకన్న సంతోషం వ్యక్తం చేశారు.

తల్లీ, కుమారుడి ఆత్మహత్యాయత్నం

ముదిగొండ/రఘునాథపాలెం: తల్లీ, కుమారుడు పుగురులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని సువర్ణాపురం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన కొణతాల నర్సమ్మ, ఆమె కుమారుడు గిరి తమ స్వగ్రామం నుంచి బైక్‌పై సువర్ణాపురం పరిధిలోకి వచ్చి పురుగులమందు సేవించారు. వారిని స్థానికులు గుర్తించి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ముదిగొండ ఎస్ఐ గజ్జెల్ల నరేశ్ తెలిపారు.

‘జలవిహారం’ కలేనా?

- భద్రాచలం వద్ద టూరిజం అభివృద్ధిపై శీతకన్ను
- గోదావరిలో విహారం ఏర్పాటు చేస్తే భక్తులకు ఆహ్లాదం
- శాశ్వత బోటింగ్ పాయింట్‌తో ఆదాయం, ఉపాధి



గోదావరి నదిపై పాపికొండల వద్ద లాంచీ విహారం (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం వద్ద భక్తులకు గోదావరిలో జలవిహారం కలగానే మిగిలిపోతోంది. వేలంపాట ద్వారా తాత్కాలికంగా బోట్లను తిప్పేందుకు గ్రామ పంచాయతీ అధికారులు అవకాశం ఇస్తున్నారు. కానీ శాశ్వత ప్రాతిపదికన బోటింగ్ పాయింట్‌ను, టూరిజం స్పాట్‌లను అభివృద్ధి చేయటంలో ఆయా శాఖలు చొరవ చూపటం లేదు. కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖలు కూడా శీతకన్ను వేస్తున్నాయి.

ప్రస్తుతం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బోటింగ్..

మహారాష్ట్రలో పుట్టి సుదీర్ఘంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహించే గోదావరి భద్రాచలం మీదుగా ప్రయాణిస్తోంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో వేంచేసియున్న శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకునేందుకు, ఏజెన్సీ ప్రాంత ప్రకృతి అందాలను, జలపాతాలను, పాపికొండలను వీక్షించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. భద్రాచలం, పర్ణశాల పుణ్యక్షేత్రాల్లో గోదావరిలో నీరు ఉన్నప్పుడు భక్తులకు, పర్యాటకులకు నదిలో కొద్ది సేపు విహారం చేసేందుకు ఇంజన్‌తో కూడిన పడవలకు అనుమతిని ఇస్తున్నారు. ఇందు కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహిస్తున్నారు. ఎగువ నుంచి ప్రవాహ ఉధృతి పెరిగినప్పుడు నిర్వాహకులు ఎప్పటికప్పుడు బోటింగ్ పాయింట్ మార్చుకుంటున్నారు.

బోటింగ్ పాయింట్‌కు అనుకూలతలు..

గోదావరి స్నానఘాట్‌లకు ఎగువన దిగువన గోదావరి పుష్కరాల సమయంలో మెట్లను నిర్మించారు. వీటి ద్వారానే భక్తులు గోదావరి తీరానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి ఎగువన ఉన్న గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే ఘాట్ ఉంది. ఇక్కడ లేదా ఇంకా ఎగువ లేదా దిగువ భాగంలో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంది. తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వతంగా బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తే నది విహారానికి భక్తులు, పర్యాటకుల ఆదరణ పెరిగే అవకాశం ఉంది. తద్వారా టూరిజం అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.



జలవిహారంలో చిన్నారుల కేరింతలు (ఫైల్)

పర్యాటక, దేవాదాయ శాఖలు దృష్టి పెడితే...

ప్రస్తుతం గోదావరి నదిపై ఉన్న మొదటి బ్రిడ్జి నిర్మాణానికి పూర్వం లాంచీల ద్వారానే భక్తులు, ప్రజలు భద్రాచలానికి రాకపోకలు సాగించారు. లాంచీ ప్రమాదం జరగటం, తద్వారా మొదటి బ్రిడ్జి నిర్మాణం జరగటంతో భద్రాచలం కేంద్రంగా లాంచీల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏపీలో ఉన్న పోచవరం వద్ద నుంచే పాపికొండలకు లాంచీల విహారం నడుస్తోంది. అది కాకుండా గోదావరి వరదలు ముంచెత్తినప్పుడు వరద ముంపు బాధితులను రక్షించేందుకు మాత్రమే ఏపీ నుంచి లాంచీలను తీసుకొచ్చి సహాయక చర్యలను చేపడుతున్నారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నందున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శాశ్వతంగా నిలిచే అవకాశం ఉందని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం కేంద్రంగా జలవిహారంను అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖ ప్రణాళికలను రూపొందించాలని పలువురు కోరుతున్నారు. భద్రాచలం వద్ద నుంచి మోతె గడ్డలో కొలువై ఉన్న శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు లాంచీల విహారానికి అవకాశం ఉంది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తే టూరిజం అభివృద్ధితోపాటు ద్వీపంలా ఉండే మోతె గడ్డ ఆలయం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు భద్రాచలంలోనే జలవిహారం అనుభూతులను పొందవచ్చు. ఇప్పటికైనా పర్యాటక, దేవాదాయ శాఖలు దృష్టి సారించి భద్రాచలం కేంద్రంగానే జలవిహారం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జలవిహారం చేపట్టాలి



గోదావరిలో జలవిహారం చేయాలంటే పాపికొండల యాత్రకు ఏపీలో సుదూరంగా ప్రయాణించాల్సి వస్తుంది. భద్రాచలం కేంద్రంగా బోటింగ్ పాయింట్‌తో పాటు నదిలో విహరించేలా అన్ని రక్షణ చర్యలతో లాంచీలు ఏర్పాటు చేయాలి. మోతె గడ్డ, ఆ పైన ఉన్న పర్ణశాలల వరకు జలవిహారం చేసేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి. జలవిహారానికి అవకాశం కల్పిస్తే భద్రాచలానికి జాతీయస్థాయిలో పర్యాటక గుర్తింపు లభించే అవకాశం ఉంది. – **లోకేష్, స్థానికుడు**

తల్లడిల్లుతున్న పేగుబంధం..

- కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బతీసిన రోడ్డు ప్రమాదం
- గాయపడిన కుమారుడి చికిత్స కోసం రూ.22 లక్షలు ఖర్చు
- వడదెబ్బతో ఈ నెల 6న తండ్రి మృతి
- భారమంతా నెట్టుకొస్తున్న తల్లి
- దాతల చేయూత కోసం ఎదురుచూపులు

దీనగాథ



చికిత్స పొందుతున్న అవినాష్

ఖమ్మంమయూరిసెంటర్: రెక్కాడితే కాని డొక్కాడని ఆ కుటుంబాన్ని ఓ ప్రమాదం కోలుకోలేని దెబ్బతీసింది. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితికి చేరగా.. కుటుంబానికి పెద్ద దిక్కయిన తండ్రి వడదెబ్బతో మృతిచెందాడు. మరో కొడుకు ఉపాధి లేక చిన్న చిన్న పనులు చేస్తున్నా కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత తల్లిపై పడటంతో ఏంచేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే రోడ్డుప్రమాదంలో గాయపడిన కుమారుడికి చికిత్స కోసం రూ.22 లక్షల మేర అప్పు చేసిన ఆ కుటుంబం తండ్రి మృతితో మరింత కష్టంలో పడిపోయింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ కొత్తూరు గ్రామానికి చెందిన వల్లెపు నరసింహారావు, నళిని దంపతులకు ఇద్దరు కొడుకులు. వీరిలో వల్లెపు అవినాష్ గతేడాది నవంబర్ 8న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. అవినాష్‌ను చికిత్స కోసం హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రులకు తిప్పారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటి వరకు బంధువులు, తెలిసిన వారి వద్ద రూ.22 లక్షల వరకు అప్పులు చేసి అతని చికిత్సకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఆయన వైద్యానికి రోజుకు రూ.10 వేలు ఖర్చు అవుతోంది.

వడదెబ్బతో తండ్రి..

ఇదే పరిస్థితితో ఇబ్బందులు పడుతుండగా.. యజమాని నరసింహారావు కూడా మరణించాడు. ఎండల్లో పనిచేయడంతో వడదెబ్బకు గురై ఈ నెల 6న మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఒక పక్క కొడుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉండగా.. ఇలా భర్త అర్ధాంతరంగా ముగియడంతో ఆమె గుండె పగిలింది. ఇక మరో కొడుకు అభిలాష్ హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. అది ఖర్చుల వరకు కూడా సరిపోవడం లేదని నళిని వాపోయింది. ప్రస్తుతం నళిని కూలీ పనులకు వెళ్తూ నెట్టుకొస్తోంది. తమను ఆదుకోవాలని వేడుకుంటోంది. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు 79896 32983 నంబర్‌లో సంప్రదించాలని బంధువులు కోరారు.

రజతోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం గాంధీచౌక్ : వచ్చే నెల 20న హైదరాబాద్‌లో జరిగే శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ రఘునాథాచార్యులు మాట్లాడుతూ.. వేడుకలకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ శేషాచార్యులు, సహాయ కోశాధికారి ఎన్‌సీహెచ్ పాండురంగాచార్యులు, ఎం. కేశవాచార్యులు గోపాల్, గోవర్ధన వెంకటరమణ, కె.కిరణ్‌కుమార్ ఎం.వేణు కె.మధు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఎర్రజెండాలే ప్రజలకు అండ..

- మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం
- కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాలలో కేంద్ర ప్రభుత్వం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

బూర్గంపాడు: ప్రజలకు ఏ కష్టమొచ్చిన ఎర్రజెండాలే అండగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సారపాక తాళ్లగొమ్మూరులోని ఐటీసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా 2వ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుందని, కార్పొరేట్‌శక్తుల చేతుల్లో కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మగా మారి కాపలాదారుగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వారి హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఏఐటీయూసీ కార్మిక సంఘంగా ఉందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను వేలం వేసేందుకు కుట్రలు చేయడంతో పాటు సంఘాలు పెట్టుకోవడం, నిరసనలు తెలిపే అవకాశాలను కూడా కేంద్ర ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. దేశ రక్షణ, కార్మిక హక్కుల రక్షణ ఎర్ర జెండాలతోనే సాధ్యమవుతుందని, కార్మిక సంఘాలు సిద్ధాంతాలు వేరైనా లక్ష్యం ఒకటేనన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం రాజకీయ చైతన్యాన్ని పెంచుకొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాటాలను వివరించారు. కడారు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలను వాసిరెడ్డి సీతారామయ్య జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ మహాసభలలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బొల్లోజు అయోధ్య, పాకాలపాటి వెంకటేశ్వరరావు, శింగు నర్సింహారావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ముత్యాల విశ్వనాథం, రేసు ఎల్లయ్య,కల్లూరి వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, సీహెచ్.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా చేపట్టాలి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కోతకు గురైన బ్రిడ్జి రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రహదారి.. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు పంట పొలాలు సైతం నాశనమయ్యాయి. నాడు బ్రిడ్జికి తాత్కాలికంగా మరమ్మతులు చేసినా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోయారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం మరలా అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి సదరు బ్రిడ్జిని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత తరుణంలో సమస్యకు శాశ్వత పరిష్కారానికి వీలుబడడం లేదన్నారు. బ్రిడ్జికి ఇరువైపులా కాంక్రీటుతో రోడ్డును పటిష్ఠం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఆ తర్వాత అక్కడి గ్రామస్తుల నుంచి బ్రిడ్జి సమస్యతో పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని ఓపికగా వారికి సమాధానం ఇచ్చారు. ఈక్రమంలో మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని తహసీల్దార్ కోరగా స్వచ్ఛభారత్లో భాగంగా అవసరమైన మేరకు నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. ఆ తర్వాత వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీ వారు చూసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్, ఆర్ఐ షేక్ హుస్సేన్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారి ధరావత్ రవి ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం, మేకల విక్రయ వ్యాపారం చేస్తున్న గ్రామానికి చెందిన రవి మూడేళ్లుగా మిర్చి కొనుగోళ్ల వ్యాపారం ప్రారంభించాడు. అయితే మిర్చి వ్యాపారంలో నష్టాలు రావడంతో కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో మానసికంగా కుంగిపోయాడు. మొత్తంగా రూ.10లక్షల వరకు అప్పు ఉండడం, అప్పు ఇచ్చిన వారి సూటిపోటి మాటలు భరించలేక ఆదివారం ఉదయం చేను వద్ద పురుగుల మందు సేవించాడు. తర్వాత రవి బైక్‌పై ఇంటికి చేరుకుంటుండగా మార్గమధ్యలోనే పడిపోవడంతో గమనించిన గ్రామస్తులు అతడిని కొమరారం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో ఇల్లెందు ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిజాంపేటలో చోరీకి యత్నం..

దొంగను బంధించిన గ్రామస్తులు



పట్టుబడిన దొంగతో పోలీసులు

ఇల్లెందురూరల్ : మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ నిజాంపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి యత్నించిన ఓ దొంగను గ్రామస్తులు చాకచక్యంగా బంధించారు. వివరాలిలా.. గ్రామానికి చెందిన బర్ల వీరన్న ఇంట్లోకి తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి చొరబడే యత్నం చేశాడు. ఈక్రమంలో ఇంటి వాకిట్లో అలికిడి శబ్దం విన్న వీరన్న పక్కింటికి చెందిన మాలోత్ అశోక్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఇరువురు అప్రమత్తమై ఆ వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి వద్ద టార్చిలైట్, బ్లౌజ్‌లు ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు సదరు వ్యక్తిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టుబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం పట్టుబడిన వ్యక్తి గజదొంగగా పేరుబడిన మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన గుగులోత్ రంజిత్‌గా నిర్ధారించారు.

యువకుడిపై పోక్సో కేసు

జూలూరుపాడు: ఓ మైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై స్థానిక పోలీసులు ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ బి.తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన ఇంటర్ చదువుతున్న ఓ మైనర్‌ను అదే గ్రామానికి చెందిన యువకుడు వేధింపులకు గురి చేస్తున్నాడు. గత రెండు నెలలుగా బాలిక వెంటపడుతూ తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకుంటానని బలవంతం చేస్తుండడంతో విషయాన్ని తల్లిదండ్రులకు ఆమె చెప్పింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

దమ్మపేట: మండల కేంద్రంలోని అర్బన్‌కాలనీకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేటలోని అర్బన్‌కాలనీకు చెందిన దగ్గుబాటి తిరుపతమ్మ (52) ఈ నెల 16వ తేదీన ద్వారకా తిరుమలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. కానీ మరుసటి రోజుకు కూడా ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో ఆచూకీ కోసం వెతికారు. అయినా జాడ లభించకపోవడంతో ఆమె కుమారుడు ఫణీంద్రకుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

అడవి పంది మాంసం స్వాధీనం



నిందితులు, అడవి పంది మాంసం చూపుతున్న అధికారులు

బోనకల్: మధిర ఫారెస్ట్ రేంజ్ పరిధి మండలంలోని చొప్పాకట్లపాలెం గ్రామ శివారులో ఆదివారం అడవిపంది మాంసాన్ని విక్రయిస్తున్న ఇద్దరిపై ఫారెస్టు అధికారులు కేసు నమోదు చేశారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన వెంకన్న, బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన మొగిలి అద్దయ్య వద్ద అడవి పంది మాంసాన్ని పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజర్ విజయలక్ష్మి తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ ఫారెస్టు రేంజర్ వెంకటలక్ష్మి, ఫారెస్టు సిబ్బంది విజయ్, సురేశ్, రాజేందర్, ఉపేంద్రయ్య, తదితరులున్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామానికి చెందిన రాచబంటి వలరాజుతో పాటు మరో ఐదుగురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొదుమూరు గ్రామానికి చెందిన రాచబంటి నాగలక్ష్మి ఇంట్లోకి ఈ నెల 11వ తేదీన వలరాజుతో పాటు మరో ఐదుగురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి ఇంటి కాగితాలు ఇవ్వాలని ఇంట్లో ఉన్న బీరువా తెరిచి బట్టలను చిందరవందర చేశారు. అడ్డుకున్న నాగలక్ష్మిని కొట్టి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టూటౌన్ పరిధిలో చోరీ

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ పరిధిలో ఆదివారం ఓ చోరీ ఘటన వెలుగుచూసింది. మామిళ్లగూడెంలోని మొండిగేట్ ప్రాంతంలో నివాసం ఉండే బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి కొన్నిరోజుల కిందట రాజస్థాన్ వెళ్లాడు. తిరిగి ఆదివారం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో ఉన్న సుమారు రూ.40 వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



బానోత్ ధన్యా (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని వీఆర్ బంజర్‌కు చెందిన బానోత్ ధన్యా (50) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. తన ఇంటి వద్ద ఉన్న మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అప్పటి వరకు అందరితో మాట్లాడిన ధన్యా ఒక్కసారిగా విగజీవిగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కాచిరాజుగూడెంలో...

ఖమ్మంరూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన ఖమ్మంరూరల్ మండలం కాచిరాజుగూడెంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అద్దంకి పెద్దవెంకన్న (60)కు రెండెకరాల పొలం ఉండగా.. వరి నారుకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. పక్కనున్న రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెళ్లి చూసేసరికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాయపడిన అడవిపందికి చికిత్స

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో అడవి పంది గాయపడి ఉండటంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన పందికి చికిత్స చేయించిన అనంతరం ముచ్చర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వదిలిపెట్టామని కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హరిప్రసాద్ తెలిపారు.